

వరంగల్ బట్టలబజార్‌లోని శ్రీ బాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున 4.30 గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు స్వామి వారిని తీసుకువస్తున్న అర్చకులు, భక్తులు

# ముక్కోటి వైభవం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులకు ఉత్తర ద్వార దర్శనం

నమస్తే నెట్‌వర్క్, జనవరి 10: ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామి వారిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాయంపేటలోని శ్రీమత్స్యగిరిస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలోని విష్ణు ఆలయం ఎదురుగా ప్రత్యేక వేదికపై శ్రీసీతారామచంద్రస్వామివార్లకు ఉత్సవ ప్రతిష్ఠాపన చేసి పురోహితులు కలకుంట్ల మేఘానాథాచార్యులు, ఆలయ అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో లక్ష తులసి అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు ఏకాదశి వ్రతాన్ని అనుసరించి విష్ణునామ పారాయణం చేశారు. వరంగల్ బట్టలబజార్‌లోని బాలానగర్ శ్రీవేంకటేశ్వరాలయానికి ఉదయం ఆరు గంటల నుంచే భక్తులు ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణమంతా గోవిందనామస్మరణతో మార్మోగింది. వరంగల్‌లోని గోవిందరాజ స్వామి, పాలకుర్తి మండలంలోని వల్మిడిలోని రామాలయం, సోమేశ్వరాలయం, చిల్పూరు మండలంలోని బుగులు వేంకటేశ్వరస్వామి, గీసుగొండ మండలం కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి, నర్సంపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు.

## కమనీయం.. వీరభద్రుని కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భీమదేవరపల్లి, జనవరి 10 : కొత్తకొండ వీరభద్ర స్వామి కల్యాణం శుక్రవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. మకర సంక్రాంతిని పురస్కరించుకుని స్వామి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయంలో ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొచ్చి కల్యాణమండపంలో అందంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా, ఈవో కిషన్‌రావు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మేళతాలాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా వేదపండితులు స్వామి వారి కల్యాణం జరిపించారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజుల, ఆలయ ధర్మకర్తలు కొంగొండ సమ్మయ్య, కురుమల్ల మంజుల, గనబోయిన కొమురయ్య, బత్తిని శ్రీనివాస్, గుగులోత్ రాజునాయక్, పెండ్యాల తిరుపతి, ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, ముఖ్య అర్చకులు మొగిళిపాలెం రాంబాబు, శ్రీకాంత్, వినయ్, రమేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వాన్ని నిలదీస్తే జైల్లో వేస్తారా?

- పాలకుర్తిలో గిరిజన బిడ్డలపై అక్రమ కేసులు
- ఆర్‌జీ చానల్ రిపోర్టర్ రాజ్‌కుమార్‌ను విడుదల చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పుల, జనవరి 10 : పాలకుర్తిలో నిరంకుశ పాలన నడుస్తున్నదని, ప్రజల పక్షం వహించి ప్రభుత్వాన్ని నిలదీస్తే అరెస్ట్ చేసి జైల్లో వేస్తారా .. అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే ముగ్గురు గిరిజన బిడ్డలపై అక్రమ కేసులు పెట్టి అనేక రకాలుగా వేధించారన్నారు. అందులో ఒకరు పోలీస్‌స్టేషన్ సాక్షిగా మృతి చెందిన విషయం ప్రజలకు తెలిసిందేనని పేర్కొన్నారు. ఆర్‌జీ టీవీ రిపోర్టర్‌పై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ చానల్ రిపోర్టర్, గిరిజన బిడ్డ రాజ్‌కుమార్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తాడని, ఆయన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల పక్షాన నిలిచి అనేక రకాలుగా కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్ చేసేవాడన్నారు. అలా అని అతడిని అప్పటి ప్రభుత్వం కానీ, తాను కానీ ఇబ్బంది పెట్టిన సందర్భాలు లేవన్నారు. అతను ప్రజల నుంచి వాయిస్‌లు తీసుకొని యూట్యూబ్, సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తాడని, ఇదే పని నేడూ చేస్తున్నాడని చెప్పారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలకు చేస్తున్న అన్యాయాలు, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ఎత్తి చూపడం అతడు చేసిన నేరమా? అని ఎర్రబెల్లి ప్రశ్నించారు. రాజ్‌కుమార్‌ను గురువారం అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసి తప్పుడు కేసులు బనాయించి జనగామ జైలుకు తరలించారని, అతను చేసిన తప్పేంటి.. పాలకుర్తి ఎమ్మెల్యే ఏం సమాధానం చెబుతుందన్నారు. గిరిజన బిడ్డలు ఓట్లేస్తే గెలిచిన మీరు రేపు గిరిజనులకు ఏం సమాధానం చెబుతారని మాజీ మంత్రి ఎర్రబెల్లి ప్రశ్నించారు. పాలన చేతకాక అక్రమాలను ప్రశ్నిస్తున్న గిరిజన బిడ్డలను ఇలా పని పట్టుకొని కేసులు పెట్టిస్తే వారు తిరుగబడే రోజు వస్తుందన్నారు. రాజ్‌కుమార్‌పై పెట్టిన కేసులను ఎత్తివేసి జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ వారికి అండగా నిలిచి జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతుందన్నారు. పాలకుర్తిలో అక్రమ కేసులు, బెదిరింపులకు భయపడేది లేదన్నారు. కాగా, ఆర్‌జీ టీవీ రిపోర్టర్‌ను జైలుకు పంపడాన్ని నిరసిస్తూ శనివారం పాలకుర్తి, తొర్రూరు మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆందోళనలకు పిలుపునిచ్చిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ తెలిపారు.

## కేసీఆర్‌ను కలిసిన శంకర్‌నాయక్




కేసీఆర్‌తో శంకర్ నాయక్ దంపతులు

బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను శుక్రవారం ఎర్రవల్లిలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్-సీతామహాలక్ష్మి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆశీస్సులతో మానుకోట ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.
–మహబూబాబాద్ రూరల్, జనవరి 10

## అదిగో పెద్దపులులు

నేటి నుంచి జూపార్క్‌లో కనువిందు చేయనున్న బెంగాల్ టైగర్స్, అడవి దున్నలు

- ఎనిమల్స్ రాకతో కాకతీయ జంతు ప్రదర్శనశాలకు కొత్త కళ
- పండుగ సందర్భంగా పెరగనున్న సందర్శకుల తాకిడి
- అన్ని ఏర్పాట్లు చేసిన సిబ్బంది




జూపార్క్ ముఖ ద్వారం, సందర్శకులను కనువిందు చేయనున్న పెద్ద పులి



అడవి దున్నలు అనిత–శివ



టైగర్స్ ఎన్‌క్లోజర్స్

సుబేదారి, జనవరి10: హనుమకొండలోని కాకతీయ జూపార్క్‌లో నేటి నుంచి రాయల్ బెంగాల్ టైగర్స్, అడవి దున్నలు సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. డిసెంబర్ 2న హైదరాబాద్ నెహ్రూ జూపార్కు నుంచి రెండు పులులు కరీనా–శంకర్, 20 రోజుల క్రితం అడవి దున్నలు అనిత–శివ జంటను జిల్లా అటవీ శాఖ అధికారులు తీసుకొచ్చి ఎనిమల్స్ కీపర్స్‌తో ఇక్కడి వాతావరణానికి అలవాటు చేశారు. టైగర్స్, అడవి దున్నల కోసం వేర్వేరుగా రెండు ఎన్ క్లోజర్లను ఏర్పాటు చేశారు. పెద్ద పులులను సందర్శకులు చూడడానికి 18 ఫీట్ల ఎత్తులో ఇనుప రాడ్లతో పెద్ద జాలితో డే షెల్టర్, ఆహారం తీసుకోవడానికి, రాత్రిపూట సేద తీరడానికి రెండింటికి వేర్వేరుగా నైట్ షెల్టర్ నిర్మించారు. అడవి దున్నలకు కూడా డే, నైట్ షెల్టర్ ఏర్పాటు చేశారు. అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం టైగర్స్, అడవిదున్నల ఎన్‌క్లోజర్స్‌ను ప్రారంభిస్తారని జిల్లా అటవీ శాఖాధికారి లావణ్య తెలిపారు. జంతువుల రాకతో జూపార్కుకు కొత్త కళ రానున్నది. సంక్రాంతి పండుగ సెలవుల్లో పిల్లలు, పెద్దల సందర్శనతో జంతు ప్రదర్శనశాలకు తాకిడి పెరగనున్నది.

### పొద్దున చికెన్.. సాయంత్రం బీఫ్ మటన్



పెద్ద పులులను చూసుకోవడానికి హైదరాబాద్ నెహ్రూ జూర్కులో వారం రోజుల శిక్షణ ఇచ్చారు. ఇక్కడికి వచ్చిన తర్వాత ఆడ పులిని కరీనా, మగ పులిని శంకర్ అని పిలుస్తూ వాటికి ఆహారం అందించా. డ్రెస్ కోడ్‌తో గుర్తు పడుతాయి. ఆహారం కోసం ఫేస్ చూపిస్తాయి. ఉదయం 9.30 గంటలకు కిలో చికెన్, అది తిన్న తర్వాత వాటర్‌లో మినరల్స్ ఇస్తాం. సందర్శకులు చూసే డే షెల్టర్‌లోకి వదిలిపెట్టి ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేలా చేశాం. రోజూ ఉదయం 9.30కి కిలో చికెన్, సాయంత్రం 5 గంటల తర్వాత 8కిలోల బీఫ్ మాంసం పెడతాం.
– ఎం సాంబమూర్తి, టైగర్స్ కీపర్

### అడవి దున్నల డైట్

అడవి దున్నలకు పొద్దున పాలకూర, క్యారెట్, డజన్ అరటిపండ్లు, తౌడు బెల్లం, గడక, మధ్యాహ్నం 10 కిలోల పచ్చగడ్డి ఆహారంగా ఇస్తామని కీపర్ కొమురయ్య తెలిపారు. డ్రెస్ కోడ్‌తో గుర్తుపడుతాయని, వారం రోజులు వాటిని చూడానికి శిక్షణ తీసుకున్నట్లు చెప్పారు.

### పులుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



బెంగాల్ టైగర్స్ వేసవిలో ఎక్కువగా సిక్ అవుతాయి. పేన్లు, గోమర్లతో టిక్ ఫీవర్ వస్తుంది. టైగర్స్ కీపర్ రోజూ వాటి కదలికలపై ఆరా తీస్తాడు. అనారోగ్యానికి గురైనట్లు తెలిస్తే వెంటనే నైట్ షెల్టర్‌లో బంధించి చెక్ చేసి టీకాలు వేస్తాం. మినరల్స్ ఇస్తాం. సహజంగా పెద్ద పులి 12 ఫీట్ల ఎత్తులో దూకుతుంది. చలికాలంలో అగ్రెసివ్‌గా ఉంటాయి. ఈ సీజన్‌లో వాటి దగ్గరికి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉంటాం. ఇక్కడి వాతావరణానికి బాగానే అలవాటుపడ్డాయి.
–ఎం సాంబరాజ్, వెటర్నరీ అసిస్టెంట్

## 'తెలంగాణ తల్లి'పై మరోమారు వివాదం

విగ్రహం వద్ద ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని నోటీసులు



కామారెడ్డిగూడెంలో ముసుగుతో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం

దేవరుప్పుల, జనవరి 10 : దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం ఎస్సీకాలనీలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహంపై మరోమారు వివాదం తలెత్తింది. కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి పార్టీ సహకారంతో ఎస్సీ కాలనీలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఎలాంటి అనుమతి లేదని, తొలగించాలని అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ఎంపీడీవో, ఎస్సైకి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ఉద్యోగులు ఎక్స్‌కవేటర్‌తో విగ్రహాన్ని తొలగిస్తున్న సమయంలో గ్రామస్తులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఎస్సీ కాలనీలోని వీధి చివరన ఎలాంటి ఇబ్బందిలేని స్థలంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహంపై వివాదం ఎందుకని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. దీంతో అధికారులు వెనక్కి తగ్గడంతో వివాదం అప్పుడు సమసిపోయింది. ఇటీవల విగ్రహం చుట్టూ గ్రానైట్ వేస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు మరోమారు జోక్యం చేసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మరోమారు వివాదం తలెత్తింది. దీంతో విగ్రహ ఏర్పాటుకు అనుమతి లేదని, అక్కడ వ్యక్తులు కానీ, సమూహాలు కానీ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టొద్దని, ఒకవేళ చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని గ్రామపంచాయతీ ఈ విగ్రహానికి నోటీసులు అంటించింది.

## ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని ఇద్దరు మృతి
- మైదాం చెరువు తండా వద్ద ఘటన
- మృతులు సూర్యాపేట జిల్లావాసులు



పేరాల వెంకన్న, జ్యోతి(ఫైల్)

కొడకండ్ల, జనవరి 10 : జనగామ–సూర్యాపేట జాతీయ రహదారిపై నిలిపి ఉన్న డీసీఎం ఐచర్ వాహనాన్ని తిరుమలగిరి వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొనగా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి కొడకండ్ల మండలంలోని మైదాం చెరువుతండా వద్ద చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన పేరాల వెంకన్న(45), పేరాల జ్యోతి(35)తో పాటు మరో తొమ్మిది మంది జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో ఓ కార్యక్రమానికి వెళ్లి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో మైదాం చెరువుతండా వద్ద జాతీయ రహదారిపై నిలిపిన డీసీఎం వాహనాన్ని వీరి వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న పేరాల వెంకన్న, పేరాల జ్యోతి అక్కడికక్కడే మృతిచెందారు. వీరు బావమరదళ్లు. పేరాల ఉషయ్య, పేరాల లక్ష్మి, పేరాల లావణ్య, పేరాల ఉప్పలమ్మ, పేరాల ముత్యాలు, వంగూరి నర్సమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరంతా ఒకే కుటుంబంతో పాటు బంధువులని తెలిసింది. క్షతగాత్రులను జనగామ ప్రభుత్వ దవాఖాన, వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్‌కు తరలించారు. కాగా రాత్రి కావడంతోనే నిలిపి ఉన్న ఐచర్ వాహనం సరిగా కనిపించక ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

## నేడు ఎల్కేశ్వరానికి సిరికొండ

చిన్నకాళేశ్వరం భూనిర్వాసితులతో మాట్లాడనున్న నేతలు

మహదేవపూర్, జనవరి10 : మహదేవపూర్ మండలం ఎల్కేశ్వరం గ్రామానికి శనివారం మాజీ స్పీకర్, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి రానున్నారు. చిన్నకాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామంలో పలువురు రైతులు తమ భూములు కోల్పోతుండగా నష్టపరిహారం కోసం కొద్దిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో భూ నిర్వాసితుల సమస్యలను తెలుసుకునేందుకు బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, భూపాలపల్లి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బాధిత రైతులతో ఆయన మాట్లాడనున్నారు.

## వైద్యులను సర్దుబాటు చేస్తాం

డీఎంహెచ్‌వో అప్పయ్య

నమస్తే ఎఫెక్ట్

శాయంపేట, జనవరి 10 : శాయంపేట సర్కారు దవాఖానలో వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అల్లం అప్పయ్య అన్నారు. 'పేరుకు 24గంటలు.. 4గంటల వరకే విధులు' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. 24గంటల వైద్య సేవలు అందేలా చూస్తామని చెప్పారు. శాయంపేట పీహెచ్‌సీలో డిప్యూటేషన్‌లో ఉన్న డాక్టర్‌ను అవసరం మేరకు సర్దు చేయాల్సి వచ్చిందన్నారు. ఇక్కడ వైద్య సేవల్లో ఇబ్బందులున్నందున డాక్టర్‌ను వెంటనే సర్దుబాటు చేస్తామన్నారు. ప్రతి పీహెచ్‌సీలో ఒక డాక్టరు ఉండేలా చూస్తున్నామన్నారు. అలాగే ఇక్కడ ఇద్దరు సిస్టర్లు ఉండగా ఒకరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 24గంటల ఆస్పత్రిలో నలుగురు సిస్టర్లు ఉంటే వైద్యం పూర్తిగా అందుతుందని సిస్టర్ల సర్దుబాటు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. అలాగే శాయంపేట డాక్టర్ పనితీరు మెరుగుపరుస్తామన్నారు. డిప్యూటేషన్‌లో ఉన్న హెల్త్ అసిస్టెంట్ విషయంలోనూ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఆద్యంతం ఉత్కంఠ

- హోరాహోరీగా సెపక్‌తక్రా పోటీలు
- 28 రాష్ట్రాల నుంచి పాల్గొన్న 600 మంది క్రీడాకారులు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 10: హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లోని ఇండోర్ స్టేడియంలో 34వ సీనియర్ నేషనల్ సెపక్‌తక్రా పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పోటీలను ప్రారంభించారు. ఈనెల 14 వరకు జరుగనున్న ఈ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు , 30 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్‌లో తలపడనున్నారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రిక్కల శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ లయన్ హనుమాండ్ల రెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్, కోశాధికారి మైనం వికేశ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్, బీజేపీ హనుమకొండ, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రావు పద్మ, చందుపట్ల కీర్తిరెడ్డి, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్‌నాయక్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ రమేశ్‌రెడ్డి, సెపక్‌తక్రా అసోసియేషన్ ఉపాధ్యక్షులు బీ జగన్నాథస్వామి, డీ శ్రీధర్, జీ సంజీవరెడ్డి, కే అనిత, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్స్ ఎస్ఆర్ విజయరాజ్, పీ సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలు కునమల్ల జితేందర్‌నాథ్, గన్ను విజయభాస్కర్‌రెడ్డి, ఎండీ జరీపుద్దీన్, పర్లపెల్లి శిరీష, అసోసియేట్ జాయింట్ సెక్రటరీలు డీ గోపాలకృష్ణ, జీ అయోధ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే శ్రీకాంత్, ఈసీ మెంబర్స్ ఆనంద్, బండి వెంకట్రామిరెడ్డి, కే అర్చన, బీ భాస్కర్‌గౌడ్, కలకోట్ల భాస్కర్, రిక్కల వెంకటరామకృష్ణ, చామకూర బాగారెడ్డి, టీ యోగేశ్వరి, ఎస్ విజయరేఖ, అసోసియేట్ ఈసీ మెంబర్స్ ఎస్ ఈశ్వర్‌కుమార్, డీ దినేశ్, ఎస్ కరుణాకర్, కే మల్లేశం పాల్గొన్నారు.

**మొదటి రోజు ఫలితాలు**

ఉమెన్స్ టీం ఈవెంట్‌లో: ఉత్తరప్రదేశ్‌పై ఎస్ఎస్‌బీ (3–0), అస్సాంపై బిహార్(1–2), తెలంగాణపై నాగాలాండ్(2–1), బిహార్‌పై ఎస్ఎస్‌బీ(3–0), హర్యానాపై మణిపూర్(0–3), హర్యానాపై నాగాలాండ్(1–2), తెలంగాణపై మణిపూర్(3–0) జట్టు గెలుపొందింది. మెన్స్ టీం ఈవెంట్‌లో: మహారాష్ట్రపై ఎస్ఎస్‌బీ(3–0), తెలంగాణపై ఢిల్లీ(3–0), తమిళనాడుపై అస్సాం(2–1), ఉత్తరప్రదేశ్‌పై మణిపూర్(3–0), తమిళనాడుపై ఎస్ఎస్‌బీ(3–0), అస్సాంపై మహారాష్ట్ర(1–2), తెలంగాణపై ఉత్తరప్రదేశ్(1–2), అస్సాంపై ఎస్ఎస్‌బీ(2–1), మహారాష్ట్రపై తమిళనాడు(2–1), తెలంగాణపై మణిపూర్(3–0), మణిపూర్‌పై ఢిల్లీ(2–1) జట్టు గెలుపొందింది.

### ములుగు బస్సు కోసం ఎదురుచూపులు..



పండుగ సెలవుల నేపథ్యంలో రద్దీ పెరగడంతో శుక్రవారం రాత్రి హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాశారు. అదనంగా బస్సులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో చలిలో ఇబ్బందులు పడ్డారు. ములుగు ప్లాట్‌ఫామ్‌తో పాటు బస్టాండ్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.
– ములుగు, నమస్తేతెలంగాణ

## నేనెవరో తెలుసా.. నన్ను చెక్ చేస్తారా?

- పోలీసులపై కాంగ్రెస్ మాజీ సర్పంచ్ వీరంగం
- హల్‌చల్ చేసి అబాసుపాలు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌కు జరిమానా.. జైలు శిక్ష విధించిన కోర్టు



డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన చంద్రబాబు

లింగాలఘనపురం, జనవరి 10: 'నన్ను ఏమనుకుంటున్నారు? నేనెవరో తెలుసా? నేను సర్పంచ్‌ను.. మా పార్టీ అధికారంలో ఉంది.. మీరెంత.. నన్నే చెక్ చేస్తారా? ఎమ్మెల్యేతో ఫోన్ చేయించాలా? లేదా మంత్రితో చెప్పించాలా'? అంటూ పాలకుర్తి మండలం ఈరవెన్ను మాజీ సర్పంచ్ ముస్కు చంద్రబాబు అతిగా ప్రవర్తించి అబాసుపాలయ్యాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినందుకు పోలీసులు కేసు నమోదు చేయగా, కోర్టు శుక్రవారం రూ.1500 జరిమానా, మూడు రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా లింగాలఘనపురం ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తన బలగాలతో కుందారం క్రాస్ వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టాడు. ఈ క్రమంలో ఈరవెన్ను గ్రామానికి చెందిన చంద్రబాబు మద్యం తాగి తన కారులో వస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. సర్పంచ్ పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తున్నా సదరు వ్యక్తి తాను ఇంకా సర్పంచ్‌నేనంటూ, సోదా చేయవద్దంటూ, పరీక్షించవద్దని పోలీసులకు సహకరించలేదు. చివరకు పోలీసులు బలవంతంగా బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేయాల్సి వచ్చింది. శుక్రవారం జనగామ కోర్టులో ప్రవేశపెట్టడంతో జరిమానా, జైలు శిక్ష విధించింది.

### రేషన్ బియ్యం కోసం బారులు..



రేషన్ బియ్యం కోసం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మొన్నటివరకు కార్మికుల సమ్మె కారణంగా ఎక్కడా పంపిణీ చేయలేదు. ఇప్పటికే ఆలస్యం కావడంతో సంక్రాంతి పండుగ వరకైనా ఇస్తారో లేదోనని మహిళలు ఎదురుచూశారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే బియ్యం పంపిణీ ప్రారంభించడంతో ఇలా బారులు తీరుతున్నారు. బియ్యం కోసం క్యూలో వేచి ఉన్న దృశ్యం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలో రేషన్ షాప్ వద్ద కనిపించింది.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్